

## సేవాలాల్ మార్గంలో నడవాలి

జిల్లాలో శనివారం సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు.

- 9లో ▸



## పొంచి ఉన్న ముప్పు

కానులకత్త వంతెనకు శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏటా వర్షాలు కురిస్తే రోడ్డు కొట్టుకుపోతోంది.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.0 /11.2

## వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### షబ్బీర్ అలీకి సీఎం శుభాకాంక్షలు

కామారెడ్డి టౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి ఫోన్ చేశారు. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

### వచ్చేనెల 2న మారథాన్ రన్



కామారెడ్డి టౌన్: క్యాన్సర్ వ్యాధిపై ప్రజలలో అవగాహన పెంచడానికి వచ్చేనెల 2న మారథాన్ రన్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పద్మపాణి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మొదట చిన్నారులకు ఇందిరాగాంధీ స్టేడియం నుంచి కొత్త బస్టాండ్ వరకు 3కే రన్ నిర్వహిస్తామని, ఆ తర్వాత వివిధ కేటగిరీలవారీగా 5కే, 10 కే, 21 కిలోమీటర్ల రన్ పోటీలు ఉంటాయని వివరించారు. వివరాలకు 85209 70785, 91605 85578 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అథ్లెటిక్ కోచ్ శివ, ప్రతినిధులు పాల్గొన్నారు.

### చేతితో ఎత్తే మరుగుదొడ్లు లేని జిల్లాగా కామారెడ్డి

కామారెడ్డి అర్బన్: చేతితో మలం ఎత్తే మరుగుదొడ్లు, మ్యాన్‌వల్ స్కావెంజర్లు లేని జిల్లాగా కామారెడ్డిని ప్రకటించారు. ఈ మేరకు జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి రజిత ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రామాలతో పాటు పురపాలక సంఘాల్లో సర్వే చేయగా చేతితో ఎత్తే మరుగుదొడ్లు లేవని తేలిందని పేర్కొన్నారు. దీనిపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరగా ప్రజలు, సంస్థల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపారు.

### కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం జరిగిన ఇంటర్ పరీక్షలకు 782 మందికిగాను 767 మంది హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 160 మందికిగాను 153 మంది ప్రాక్టికల్స్‌లో పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 396 మంది విద్యార్థులకుగాను 375 మంది, వొకేషనల్‌లో 240 మందికిగాను 227 మంది హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు.

### డెయిరీ, లైఫ్‌సైన్స్ పూర్వ విద్యార్థులతో ముఖాముఖి



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అల్వేస్ పటేల్, లక్ష్మారెడ్డి కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ అల్వేస్ పటేల్ లండన్‌లో సొంత కంపెనీ ప్రారంభించి అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. పటేల్, లక్ష్మారెడ్డిలను ప్రిన్సిపల్ సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, అకడమిక్ కోఆర్డినేటర్లు విశ్వప్రసాద్, జయప్రకాష్, శ్రీనివాస్‌రావు, రాజ్‌గంభీర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### బిచ్కుంద ఎస్సైపై ఫిర్యాదు

కామారెడ్డి క్రైం: భూమిని వదులుకోకపోతే చంపుతామని ఎస్సైతోపాటు మరికొందరు బెదిరిస్తున్నారని బిచ్కుందకు చెందిన మక్కయ్య లలిత, గంగారాం ఆరోపించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ బిచ్కుంద శివారులో ఉన్న తమ భూమిని వదులుకోవాలని కొద్దిరోజులుగా బిచ్కుంద, చిన్న దడ్గి గ్రామాలకు చెందిన సాలె హన్మండ్లు, అతడి కుమారుడు అంజయ్య, విఠల్‌రెడ్డి, హన్మండ్లు బెదిరిస్తున్నారన్నారు. వారికి బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. వారంతా కలిసి పలుమార్లు దాడికి వచ్చారని, కులం పేరుతో దుర్భషలాడారని, చంపేస్తామని, కేసుల్లో ఇరికిస్తామని బెదిరించారని పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### రెగ్యులర్‌గా తింటాం



“ మా ఇంట్లో టిఫిన్ అంటే గుర్తుకు వచ్చేది సుశీలనే. రెగ్యులర్‌గా చేసుకుని తింటాం. సాయంత్రం పూట కూడా ఇంట్లో సుశీలనే తయారు చేస్తారు. ఇంట్లో అందరం కలిసి అల్పాహారం తింటాం. ఎంతో రుచికరంగా ఉంటుంది.

– గణేశ్, బిచ్కుందవాసి

### సుశీల, పోహా రెండూ తింటాం



“ ఇంట్లో పేలాలతో సుశీల, అటుకులతో పోహా తయారు చేస్తుంటారు. పల్లి, పుట్నాల పొడి, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డలు వేసి తయారు చేస్తారు. ఈ ప్రాంతంలో చుట్టాలు వచ్చినా, స్నేహితులు వచ్చినా టిఫిన్‌గా సుశీలనే పెడతారు.

– నరేందర్, బిచ్కుందవాసి

### వారంలో నాలుగు రోజులివే..



“ మా ఇంట్లో వారంలో నాలుగు రోజులు సుశీల టిఫిన్ చేసుకుని తింటాం. అందరికీ ఈ టిఫిన్ అంటే చాలా ఇష్టం. వేడివేడిగా ఉన్నప్పుడు తింటే ఆ మజానే వేరు. పిల్లలకు ఆకలేస్తుందంటే ఇదే తయారు చేసి పెడతాం.

– శ్రీదేవి పాటిల్, మద్నూర్

### అందరికీ ఇష్టమైన టిఫిన్..



“ మా ఇంట్లో అందరికీ ఇష్టమైన టిఫిన్ సుశీలనే. తక్కువ సమయంలో సుశీలను తయారు చేసుకోవచ్చు. తక్కువ నూనెతో వండుకునే ఆహారం ఇది. వేడిగా ఉన్నపుడు నిమ్మకాయ రసం పిండుకుని తింటే ఆ రుచే వేరు..

– విజయలక్ష్మి, మద్నూర్‌వాసి

### ఎంతో రుచిగా ఉంటుంది



“ మహారాష్ట్రలో చాలా ఫేమస్ అయిన సుశీల టిఫిన్ చాలా రుచికరంగా ఉంటుంది. సరిహద్దుల్లో ఉండడంతో ఇక్కడి ప్రజలకూ ఇది ఇష్టమైన అల్పాహారమైంది.

– శంకర్‌రావ్, మద్నూర్‌వాసి

# ఆహా.. ఏమి రుచి!

హోటల్‌లో సుశీల అల్పాహారం భుజిస్తున్న ప్రజలు



మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గంలో ఆచార వ్యవహారాలే కాదు.. ఆహారపు అలవాట్లూ ప్రత్యేకంగా ఉంటాయి. ప్రధానంగా మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ మండలాల్లో మహారాష్ట్ర సంస్కృతి ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. కట్టుబొట్టుతో పాటు తినే ఆహారం కూడా ప్రత్యేకమే.. ఇక్కడ పేలాలతో చేసిన సుశీల అనే అల్పాహారం చాలా స్పెషల్. ప్రతి ఇంట్లో ఈ టిఫిన్ తయారు చేస్తారు. హోటళ్లలోనూ విక్రయిస్తుంటారు. ఈ అల్పాహారంపై 'సండే స్పెషల్'..

సండే స్పెషల్

- నోరూరించే 'సుశీల' రెసిపీ
- సరిహద్దు రాష్ట్రాల ప్రజలకు ఇష్టమైన అల్పాహారం
- ప్రతి ఇంటా తరచుగా తీసుకునే టిఫిన్
- హోటళ్లలోనూ ప్రత్యేకంగా విక్రయం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ప్రజల జీవనశైలి విభిన్నంగా ఉంటుంది. ఇక్కడ చాలా వరకు శాకాహార భోజనానికే ప్రాధాన్యత ఇస్తారు. చాలా కుటుంబాలలో ఫంక్షన్లు, పెళ్లిళ్లు, రిసెప్షన్ల సందర్భంగా మాంసాహార భోజనం దాదాపుగా ఉండదు. ఇక్కడ సుశీల అనే అల్పాహారం చాలా ఫేమస్. బిచ్కుంద, మద్నూర్, జుక్కల్ మండలాల్లో మెజారిటీ కుటుంబాల్లో అల్పాహారంగా పేలాల(మరమరాలు)తో చేసిన 'సుశీల'నే తీసుకుంటారు. ఉదయమే కాదు సాయంత్రం కూడా ఈ అల్పాహారాన్ని తింటారు. పిల్లలు అమ్మా ఆకలి అంటే చాలు.. క్షణాల్లో రెడీ చేసి ఇచ్చేస్తారు. అలాగే అటుకులతో చేసిన టిఫిన్ కూడా ఉంటుంది. హోటళ్లలో కూడా సుశీల దొరుకుతుంది. ఖర్చు తక్కువ కావడంతోపాటు తయారు చేసుకోవడం కూడా సులువు. స్టౌ వెలిగించి, గిన్నె పెట్టి వేడి అయిన తరువాత నూనె పోసి, ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి గోలిస్తారు. అందులో కాసింత అల్లంవెల్లుల్లి పేస్ట్, పసుపు వేస్తారు. తర్వాత పేలాలను నీళ్లలో పోసి వారబెట్టి గిన్నెలో వేస్తారు. అలాగే అప్పటికే దంచి పెట్టిన పుట్నాలు, పల్లీల పొడిని అందులో కలుపుతారు. కాసేపటి తర్వాత కొత్తిమీర ఆకులు వేసి ప్లేట్లలో పెట్టుకుని తింటుంటారు. పది పదిహేనే నిమిషాల్లో టిఫిన్ రెడీ అయిపోతుంది. చాలా కుటుంబాల్లో రోజూ అల్పాహారంగా తీసుకుంటారు. బంధువులు, స్నేహితులు ఇంటికి వచ్చినా టిఫిన్‌గా సుశీల వడ్డిస్తారు.



### మా దగ్గర ఇవే స్పెషల్...

మా దగ్గర పేలాలతో చేసిన సుశీల, అటుకులతో చేసిన పోహా ఎక్కువగా అమ్ముడవుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి బిచ్కుందకు పని మీద వచ్చిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఇక్కడ ఆగి సుశీల, పోహా ఇష్టంగా తింటారు.

– శ్రీహరి, వామన్‌రావ్, హోటల్ యజమానులు, బిచ్కుంద

## 'రైతులకు పరిహారం అందుతుంది'



పనులను పరిశీలిస్తున్న హైవే అధికారులు

నిజాంసాగర్: ఎల్లారెడ్డి నుంచి రుద్రూర్ వరకు 51.66 కిలోమీటర్ల ఎన్‌హెచ్ 765 డి రహదారి విస్తరణ పనులకోసం 30.59 హెక్టార్ల భూములను సేకరించామని ఎన్‌హెచ్ ఏఈఈ శ్రీధర్ కుమార్ తెలిపారు. ఆ భూములకు సంబంధించి రైతులకు నష్టపరిహారం అందుతుందన్నారు. శనివారం మహమ్మద్‌నగర్ మండలం నర్వ శివారులో జాతీయ రహదారి విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లారెడ్డి– రుద్రూర్ మధ్యలో రహదారి విస్తరణ కోసం 10.41 కిలోమీటర్ల భూమికి అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉందన్నారు. రూ. 313 కోట్ల పనులకుగాను ఇప్పటి వరకు రూ. 82 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని, వాటికి బిల్లులు చెల్లించామని తెలిపారు. కామారెడ్డి– ఎల్లారెడ్డి– పిట్లం నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.

## సలాబత్‌పూర్ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు



సలాబత్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మద్నూర్: కోళ్లలో వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు కోళ్ల రవాణాను అడ్డుకోవడానికి చర్యలు తీసుకుంటున్నారు. శనివారం తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దులోని సలాబత్‌పూర్ వద్ద పశుసంవర్ధక శాఖ అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. కోళ్ల వాహనాలు మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి రాకుండా చెక్‌పోస్ట్‌లోని పశుసంవర్ధక శాఖ, పోలీసు అధికారులు అడ్డుకుంటున్నారు. మహారాష్ట్రలోని దెగ్లూర్ నుంచి మోపెడ్‌పై అహ్మద్ మియా అనే వ్యాపారి కోళ్లను జుక్కల్ మండలానికి తీసుకెళ్తుండగా సలాబత్‌పూర్ వద్ద అడ్డుకుని తిప్పి పంపించామని పశువైద్య అధికారి వినీత్ తెలిపారు.

## లైంగిక దాడులను అరికట్టాలి




చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో అదనపు కలెక్టర్ విక్టర్

- రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్


కామారెడ్డి క్రైం: పాఠశాలల్లో పిల్లలపై లైంగిక దాడులను అరికట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వారికి శనివారం కలెక్టరేట్‌లో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి అధికారి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, డీసీపీవో స్రవంతి, సీడబ్ల్యూసీ మెంబర్ స్వర్ణలత, అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పది పరీక్షల్లో నూతన విధానం

- అడిషనల్ పేపర్లకు బదులు 24 పేజీల బుక్‌లెట్
- జిల్లాలో నాలుగు స్టేషనరీ రిసీవింగ్ సెంటర్ల ఏర్పాటు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి పరీక్షల నిర్వహణలో పలు మార్పులు చేసింది. గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసి, పూర్వ పద్ధతిలో మార్కుల విధానాన్ని అమలులోకి తెచ్చింది. అడిషనల్ అవసరం లేకుండా 24 పేజీల బుక్‌లెట్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాకు సరిపడా బుక్‌లెట్‌లు చేరుకున్నాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

వచ్చేనెల 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 1,011 ఉండగా 12,579 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పరీక్ష సమయంలో విద్యార్థులకు ప్రశ్నపత్రంతో పాటు ఓఎంఆర్ షీట్, జవాబులు రాసేందుకు 4 పేజీలు ఇవ్వడం, అందులో జవాబులు రాయడం పూర్తయ్యాక అడిషనల్ షీట్లు ఇవ్వడం చేసేవారు. కానీ అడిషనల్ షీట్లు అడగాల్సిన అవసరం లేకుండా ఈసారి 24 పేజీలతో బుక్‌లెట్‌ను తీసుకువస్తున్నారు. అన్ని జవాబులు బుక్‌లెట్‌లోనే పూర్తి చేయాల్సి ఉంటుంది.



### నాలుగు చోట్ల..

జిల్లాకు 24 పేజీలతో కూడిన బుక్‌లెట్లు ఇప్పటికే చేరుకున్నాయి. వాటిని భద్రపరిచేందుకు జిల్లాలో నాలుగు స్టేషనరీ రిసీవింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణ కేంద్రాలతో పాటు పిట్లం మండల కేంద్రంలో ఇవి ఉన్నాయి. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఈ సెంటర్ల నుంచి పరీక్షా కేంద్రాలకు బుక్‌లెట్‌లను తీసుకు వెళ్లనున్నారు.

### “ విద్యార్థులకు ఇబ్బందులు ఉండవు



పదోతరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. ఈసారి విద్యార్థులు జవాబులు రాసేందుకు బుక్‌లెట్లను ఇవ్వనున్నాం. దీని ద్వారా తరచూ అడిషనల్ షీట్లు అడగాల్సిన అవసరం ఉండదు.

– ఎస్.రాజు, డీఈవో, కామారెడ్డి

# పిచ్చెక్కిస్తున్న కల్తీ కల్లు

- జిల్లాకేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే అతడు కల్తీ కల్లుకు బానిస. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మూడు రోజుల పాటు కల్లుకు దూరంగా ఉండడంతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించాడు. చేసేది లేక ఆస్పత్రి సిబ్బంది కాళ్లు, చేతులు కట్టేసి వైద్యం అందించారు. అయినా కట్లు తెంచుకుని నానా హంగామా సృష్టించాడు. కల్తీ కల్లు దొరక్కే ఇలా ప్రవర్తించాడని వైద్యులు చెప్పారు.
- పట్టణానికి చెందిన ఓ వృద్ధుడు రెండు నెలల క్రితం కుటుంబంతో కలిసి తీర్థయాత్రలకు ఉత్తరాదికి వెళ్లాడు. అతడికి మందు కలిపిన కల్లు అలవాటు ఉంది. తీర్థ యాత్రలో మందు కల్లు లభించకపోవడంతో వింతగా ప్రవర్తించాడు. ఓ పుణ్య క్షేత్రం వద్ద కుటుంబాన్ని వదిలి ఎక్కడికో వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు నాలుగు గంటల పాటు శ్రమించి అతడిని పట్టుకుని అద్దె కారులో కామారెడ్డికి తరలించారు.

- జిల్లాలో యథేచ్ఛగా విక్రయాలు
- అనారోగ్యం పాలవుతున్న కల్లు ప్రియులు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్‌శాఖ యంత్రాంగం

కామారెడ్డి క్రైం: ప్రజల జీవితాలను కల్తీ కల్లు చిత్తు చేస్తోంది. కల్లు లభించకపోతే పిచ్చివారిగా మారిపోతున్నారు. కల్తీ కల్లు కారణంగా కొందరు ఆస్పత్రుల పాలవుతుండగా చాలామంది వింతగా ప్రవర్తించడంతోపాటు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఒక్కసారి అలవాటు పడితే కల్తీ కల్లు లేనిదే ఉండలేరు. మందు కల్లు తాగేవారికి అది లభించకపోతే కాళ్లు, చేతులు పని చేయవు. ఈ నేపథ్యంలో ఏదైనా ఊరికి వెళ్లేవారు బట్టలు సర్దుకోవడంతో పాటు కల్లు ప్యాకెట్‌లను కూడా వెంట తీసుకువెళ్తారు.

**పోటీ పడి మరీ...**

కల్తీ కల్లు తయారీలో ప్రమాదకరమైన మత్తు మందులను వాడుతున్నారు. పొద్దంతా శ్రమించి వచ్చేవారు అలసటను మర్చిపోవడం కోసం కల్లు సేవిస్తుంటారు. గతంలో ఎక్సైజ్ శాఖ దాడులు పెరగడంతో మత్తు పదార్థాల వినియోగం తగ్గినప్పుడు వాటి ప్రభావం బయటపడింది. డైజోఫాం, అల్ప్రాజోలం లేకుండా కల్లు విక్రయించినప్పుడు మత్తు దొరక్క వందల సంఖ్యలో కల్లు ప్రియులు వింతగా ప్రవర్తించారు. కొందరు మతిస్థిమితం కోల్పోయారు. పలు కల్లు డిపోలలో ప్రమాదకరమైన మత్తు మందులను పోటీపడి మరీ కలుపుతున్నారనే ఆరోపణలున్నాయి. తమ వ్యాపారాన్ని పెంచుకోవడం కోసం డోసు పెంచుతున్నట్లుగా తెలుస్తోంది. ఎంతో మంది మందుకల్లు మత్తులో విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అన్నీ తెలిసి కూడా ఎక్సైజ్ శాఖ ఈ అక్రమ దందాను అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదన్న విమర్శలున్నాయి. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో కల్తీని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



కామారెడ్డిలోని ఓ డిపోలో తయారు చేస్తున్న కల్తీ కల్లు

### విచ్చలవిడిగా..

జిల్లాలో 22 కల్లు డిపోలున్నాయి. వీటిలో కల్లును తయారు చేసి దుకాణాలకు సరఫరా చేస్తుంటారు. జిల్లా కేంద్రంలో రెండు డిపోలు, ఇవేకాకుండా మండల కేంద్రాలతో పాటు ప్రధాన గ్రామాల్లో డిపోలు, వ్యక్తిగత లైసెన్సులు కలిగిన కల్లు తయారీ కేంద్రాలు నడుస్తున్నాయి. ముఖ్యంగా కల్లు డిపోలలో స్వచ్ఛమైన కల్లుకు బదులుగా కల్తీకల్లు తయారు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈత చెట్ల నుంచి సేకరించే స్వచ్ఛమైన కల్లు చుక్క కూడా ఉండడం లేదు. నీళ్లలో రంగు రుచి కోసం పౌడర్‌లు కలిపి తయారు చేస్తూ, డైజోఫాం, అల్ప్రాజోలం లాంటి మత్తు మందులను, నిద్ర మాత్రల పొడిని కలుపుతున్నట్లు తెలుస్తోంది.

### “ చర్యలు తీసుకుంటాం

స్వచ్ఛమైన కల్లును మాత్రమే విక్రయించాలి. కల్తీ కల్లును విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. గతంలో మా దృష్టికి వచ్చిన అన్ని ఫిర్యాదులపైన విచారణ జరిపించాం. ఇటీవల మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఎక్కడైనా కల్తీ కల్లు విక్రయిస్తున్నట్లయితే సమాచారం ఇవ్వాలి. తగిన చర్యలు తీసుకుంటాం.

– హన్మంత్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, కామారెడ్డి

## సమగ్ర సర్వేలో పాల్గొనని కుటుంబాలకు మరో అవకాశం

కామారెడ్డి క్రైం: ఇటీవల నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనని కుటుంబాలు తమ వివరాలు నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. గతంలో సర్వేలో పాల్గొనని వారు సంబంధిత మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఈనెల 28 వరకు వివరాలు నమోదు చేసుకోవాలని, లేదా టోల్‌ఫ్రీ నంబర్ (040 2111 1111)కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని సూచించారు.

## క్లుప్తంగా

### ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



వంటకాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

**నిజాంసాగర్:** మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని మంజీరా పాఠశాలలో శనివారం నిర్వహించిన చిన్నారుల ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఆకట్టుకుంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్న చిన్నారులు తమ ఇళ్ల నుంచి తీసుకొచ్చిన వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కీర్తిరమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా చెరుకు క్రషింగ్

**సదాశివనగర్:** మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం నాటికి 3లక్షల437 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు.

### ఎల్లారెడ్డికి నలుగురు ఉపాధ్యాయుల కేటాయింపు

**ఎల్లారెడ్డిరూరల్:** ఎల్లారెడ్డి మండలానికి నలుగురు ఉపాధ్యాయులు నియామకమైనట్లు ఎంఈవో వెంకటేశం శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలో డీఈవో రాజు ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. మండలంలోని సాతెల్లి పాఠశాలకు ప్రవీణ్, జంగమాయిపల్లి పాఠశాలకు భాగ్యలక్ష్మి, కట్టకిందితండాకు కళ్యాణి, వెల్లుట్ల ప్రాథమిక పాఠశాలకు సత్తయ్యకు పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. వీరు సోమవారం విధుల్లో చేరనున్నట్లు పేర్కొన్నారు.

### 18న క్రీడాకారుల ఎంపిక

**తాడ్వాయి:** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 18న అండర్16 విభాగంలో జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక ఉంటుందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కుమ్మరి ధన్‌రాజ్ తెలిపారు. ఆయన శనివారం తాడ్వాయిలో మాట్లాడారు. ఇందులో ఎంపికైన వారు ఈ నెల 28 నుంచి మార్చి2 వరకు నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు.ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### పాఠశాల తనిఖీ

**ఎల్లారెడ్డిరూరల్:** మండలంలోని వెంకటాపూర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎంపీవో ప్రకాశ్ శనివారం తనిఖీ చేసి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

# ఆరాంఘర్ టు ఆర్మూర్

- బయటపడ్డ బైక్ స్కాం
- ఆరాంఘర్‌లో సూత్రధారులు
- కామారెడ్డిలో మధ్యవర్తి.. సబ్ ఏజెంట్లతో దందా
- బైక్ పోయిందని ఇన్సూరెన్స్ క్లెయిమ్.. ఆ తర్వాత సగం రేటుకే విక్రయం
- ఆర్మూర్ పోలీసుల తనిఖీల్లో వ్యవహారం గుట్టురట్టు
- ఇప్పటి వరకు 34 బైక్‌లు స్వాధీనం




**ఖలీల్‌వాడి:** సాధారణ వ్యక్తుల్లా షోరూమ్‌కు వస్తారు.. ఫైనాన్స్‌లో కొత్త బైక్‌ను కొని.. రెండు, మూడు నెలలపాటు ఈఎంఐలు చెల్లిస్తారు. ఆ తర్వాత బైక్ పోయిందంటూ బీమా క్లెయిమ్ చేసుకుంటారు. తీరా అదే బైక్‌ను సగం రేటుకే ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటూ మోసాలకు పాల్పడుతోంది ఓ ముఠా. తీగ లాగితే డొంక కదిలినట్లు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలో పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో వ్యవహారం మొత్తం బయటపడింది.ఒకటి,రెండూ కాదు..ఇప్పటి వరకుఏకంగా 35 బైక్‌లను పోలీసులు ఈ స్కామ్‌లో గుర్తించారు.

**బైక్ స్కామ్ జరిగింది ఇలా**

హైదరాబాద్‌లోని ఆరాంఘర్ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యాపారులు బైక్ స్కామ్‌లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ ముగ్గురికి కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ బ్రోకర్‌తో పరిచయం ఏర్పడింది. ఆ బ్రోకర్ పలువురు సబ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని వారికి తెలిసిన వారి ఆధార్‌కార్డు, ఒక సిమ్ తీసుకుంటారు. ఆధార్‌లో చిరునామా, వివరాలను మార్ఫింగ్ చేస్తారు. ఆ తర్వాత ఆరాంఘర్ వ్యాపారులు బైక్‌కు కావాల్సిన డౌన్‌పేమెంట్‌ను బ్రోకర్‌కు పంపిస్తారు. ఆ బ్రోకర్ డబ్బులను సబ్ ఏజెంట్లతో పాటు ఇతరులకు అందజేస్తాడు. వాళ్లు బై క్ షో రూంకు వెళ్లి నచ్చిన వాహనాన్ని కొనుగోలు చేస్తారు. మొదటి, రెండు వాయిదాలను సక్రమంగా చెల్లించిన తర్వాత బైక్‌ను ఎత్తుకెళ్లారని సమీప పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తారు. అలా బైక్‌కు ఉన్న ఇన్సూరెన్స్ డబ్బులను తీసుకుంటారు. ఇదంతా చేసినందుకు బ్రోకర్, సబ్ ఏజెంట్లు, బైక్ తీసుకున్న వ్యక్తులు ఒక్కొక్కరికి రూ. 5వేల వరకు ఆరాంఘర్ వ్యాపారులు ఇస్తారు. మిగితా డబ్బులను ఆ బ్రోకర్ ఆరాంఘర్ వ్యాపారులకు పంపిస్తారు. కొనుగోలు చేసిన బైక్‌లను కొన్ని నెలలపాటు దాచి ఉంచి.. ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, యువకులకు ఒక్కో బైక్‌ను సుమారు రూ.50వేల నుంచి 70 వేల వరకు విక్రయిస్తారు. అనంతరం ఆ డబ్బులను సైతం తిరిగి ఆరాంఘర్ వ్యాపారులకు పంపిస్తారు.

**బయటపడిందిలా..**

ఆర్మూర్ ప్రాంతంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా ఓ బైక్ పట్టుబడింది. సంబంధిత పత్రాలు సమర్పించాలని, లేదంటే పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని వాహనదారుడికి పోలీసులు తేల్చి చెప్పారు. దీంతో భయపడ్డ వాహనాదారుడు జరిగిన వ్యవహారాన్ని పోలీసులకు స్పష్టంగా వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు ఈ ఒక్క బైక్ తీగలాగితే..హైదరాబాద్‌లోని ఆరాంఘర్ లింక్ దొరికింది. పెద్ద మొత్తంలో బైక్‌స్కామ్ జరిగినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

### మరిన్ని బైక్‌లు దొరికే అవకాశం..

ఆరాంఘర్ వ్యాపారులు చెప్పిన ప్రకారం బ్రోకర్‌తోపాటు సబ్ ఏజెంట్లు విక్రయించిన బైక్‌లన్నీ ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ ప్రాంతాల్లో లభ్యమయ్యాయి. పోలీసులు శనివారం వరకు 34 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ముందుముందు మరిన్ని బైక్‌లు దొరికే అవకాశాలున్నట్లు తెలిసింది. బ్రోకర్‌తోపాటు సబ్ ఏజెంట్లను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఆరాంఘర్‌కు చెందిన ముగ్గురితో ఉన్న సంబంధాలు, వ్యాపారాలపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కాగా, తక్కువ ధరకే బైక్ కొనుగోలు చేసిన వారు కంగుతిన్నారు. వాహనాలతోపాటు డబ్బులు నష్టపోయామంటూ లబోదిబోమంటున్నారు.

# నాగమడుగు పేరుతో ఇసుక అక్రమ దందా



సిర్‌సముందర్ శివారులో ఇసుక డంపులు



గ్రామస్తులు అడ్డుకున్న ఇసుక టిప్పర్లు

- హజ్గుల్ క్వారీ నుంచి శివారులో డంపులు
- అనుమతి లేని టిప్పర్లను పట్టుకున్న గ్రామస్తులు

**బిచ్కుంద:** నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ అభివృద్ధి పనుల సాకుతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను దేవాడ వద్ద శనివారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఉదయం 11 గంటలకు లారీకి నాగమడుగు ఫ్లెక్సీలు పెట్టి హైదరాబాద్, జహీరాబాద్‌కు ఇసుక తరలిస్తుండగా గ్రామస్తులు గుర్తించి పట్టుకున్నారు. అనుమతి పత్రాలు చూయించాలని వారు కోరగా కాంట్రాక్టర్ టిప్పర్లను అక్కడే వదిలేసి బాన్సువాడ సబ్ కలెక్టర్ నుంచి అనుమతి తీసుకొచ్చారు. ఇందులో పుల్కల్ క్వారీ నుంచి సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మాత్రమే ఇసుక తీసుకెళ్లాలని అధికారులు అనుమతి పత్రం ఇచ్చారు. కానీ కాంట్రాక్టర్ నిబంధనలు పాటించడం లేదు. హజ్గుల్ మంజీరా నుంచి ట్రాక్టర్లలో సిర్‌సముందర్ శివారులో రెండు చోట్ల ఇసుక డంపులు వేసి లారీల్లో అక్రమంగా తరలిస్తున్నారు. వాహనాలను అడ్డుకున్నట్లు సమాచారం తెలుసుకున్న ఆర్‌ఐ రవీందర్ ఘటన స్థలానికి చేరుకొని కాంట్రాక్టర్‌కు అనుమతి పత్రం ఇచ్చారు. ఇసుకను ఎందుకు అక్రమంగా తరలిస్తున్నారని ప్రశ్నించాల్సిన అధికారులు అక్రమదారులకు వత్తాసు పలకడం గమనార్హం. బాన్సువాడ సబ్ కలెక్టర్, జిల్లా అధికారుల అనుమతి లేకుండానే హజ్గుల్, ఖద్గాం, పుల్కల్ క్వారీ నుంచి ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

### పోస్టర్ల ఆవిష్కరణ

**నిజాంసాగర్:** మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు వృక్షార్చన హరిత సేవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 17న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటి హరితసేన కార్యక్రమానికి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గునుకుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, పార్టీ నాయకులు రామాగౌడ్, విజయ్ కుమార్, మనీష్ రెడ్డి, మిడత సాయిలు, గజ్జల జీవన్, మల్లారెడ్డి, మైత్రి సాయాగౌడ్, నరేశ్, ఆరేటి రవి, మంగ జీవన్, మొకిరె నవీన్, పడమటి కాశీరాం తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో వృక్షార్చన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తానోబ ఆనంద్ రావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రమేశ్, రాజాగౌడ్, గంగాధర్‌రావు, సంజీవ్ పాటిల్, ప్రశాంత్ గౌడ్, గని, నాగరాజు, శంకర్, నర్సింలు, కృష్ణ, సాయిలు, రాజేశ్, అనిల్, రాజు, ప్రవీణ్, సుధాకర్, దేవరాజు, వెంకటగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### అడ్లూర్ పాఠశాలలో అన్నదానం

**కామారెడ్డి రూరల్:** మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ గ్రామంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు కోమటిపల్లి రాజు ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు, గర్భిణులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పీపుల్ హార్ట్‌బీట్ ఫౌండేషన్‌కు విరాళం



విరాళం అందజేస్తున్న సభ్యులు

**నాగిరెడ్డిపేట:** గోపాల్‌పేటలోని కేరళ స్కూల్‌కు చెందిన విద్యార్థులు శనివారం అంధుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన పీపుల్ హార్ట్‌బీట్ ఫౌండేషన్‌కు రూ.37,729 విరాళం అందజేశారు. విద్యార్థులు అందించిన విరాళాన్ని పేరెంట్స్ కమిటీ సభ్యులు ఫౌండేషన్ సభ్యులకు అందజేశారు.

### రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**నిజాంసాగర్:** మండలంలోని బ్రాహ్మణపల్లిలో శనివారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారి చిరంజీవులు, వెంకటేశం, చంద్రకాంత్, సాయిలు, సంగయ్య, సాయిలు, దస్తయ్య, మచ్చేందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి షేక్ సలామ్

**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాన్ని శనివారం జిల్లా నోడల్ అధికారి షేక్ సలామ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, ప్రాక్టికల్స్ జరిగినట్లు తెలిపారు. 63 మంది విద్యార్థులకు 61 మంది హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో జనరల్ ప్రాక్టికల్స్‌లో 4781 మందికి 4731 మంది హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ ప్రాక్టికల్స్‌లో 3152 మందికి 3046 మంది హాజరైనట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ నరేందర్, తదితరులున్నారు.

### 28 నుంచి ఎంఈడీ పరీక్షలు

**తెయూ(డిచ్‌పల్లి):** తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ థీయరీ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 4వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కంట్రోలర్ కోరారు.

### సీఐపై చర్యలు తీసుకోవాలి

- 'ఎక్స్' వేదికగా ఎమ్మెల్సీ కవిత డిమాండ్



**ఎడపల్లి(బోధన్):** ఎడపల్లి మండలం జానకంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద గురువారం మహిళపై దాడి చేసిన సీఐపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని 'ఎక్స్' వేదికగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం డిమాండ్ చేశారు. బాధిత మహిళ భాగ్యకు సత్వరం న్యాయం చేయాలని పేర్కొన్నారు. పోలీసు అధికారి మానవత్వం మరిచి మహిళపై లాఠీతో దాడి చేయడం అమానుషమన్నారు. రేవంత్‌రెడ్డి ప్రజాపాలన అంటే ఇదేనా అంటూ ప్రశ్నించారు.

### బైండోవర్ నిబంధనల ఉల్లంఘన

- ఒకరికి రూ.15వేల జరిమానా

**భిక్కనూరు:** బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేయడంతో ఆయన జరిమానా విధించినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు శనివారం తెలిపారు. మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన పెరుక శ్రీనివాస్ గతంలో ఒక కేసులో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. అట్టి బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి అతడు ఒక ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై అకారణంగా చేయిచేసుకున్నాడు. దీంతో శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసుకుని భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్ ఎదుట బైండోవర్ చేయగా రూ.15వేల జరిమానా విధించారన్నారు.

### రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**రుద్రూర్:** పోతంగల్ మండలం కొడిచర్ల శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శనివారం పట్టుకున్నారు. వీరి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోతంగల్ మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతాల్లో, గుట్టల్లో, ఇటుక బట్టిల్లో అక్రమార్కులు ఇసుక డంప్‌లు ఏర్పాటు రాత్రి వేళ టిప్పర్‌లలో నింపి పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై దృష్టిసారించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### పేకాడుతున్న 11మంది అరెస్టు

**రుద్రూర్:** కోటగిరి మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న 11మందిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. పేకాట స్థావరంపై విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న 11మందిని పట్టుకోగా, వారి వద్దనుంచి రూ. 23,440 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు.

**బోధన్ మండలంలో..**

**బోధన్ రూరల్:** మండలంలోని పెగడపల్లి గ్రామ శివారులో పేకాడుతున్న ఐదుగురిని పట్టుకుని, అరెస్ట్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి శనివారం తెలిపారు. అలాగే వారివద్ద నుంచి రూ.16,390లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు వివరించారు.



## క్రైం కార్నర్

# కూతురిని ఇంటికి తీసుకువస్తుండగా రోడ్డు ప్రమాదం


- అదుపుతప్పి బస్సు, లారీని ఢీకొన్న కారు
- తండ్రి మృతి, కుమార్తెకు తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు

**సదాశివనగర్(ఎల్లారెడ్డి):** గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చిన తండ్రి, హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటున్న కూతురును ఇంటికి తీసుకువస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి హైవే 44పై ఈఘటన జరుగగా తండ్రి మృతిచెందాడు. కుమార్తెకు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామానికి చెందిన ర్యాడ గంగాధర్(45), ఈనెల 14న దుబాయ్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చాడు. అతడి కూతురు లహరి హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుండగా, ఇంటికి తీసుకురావడానికి శుక్రవారం ఆయన కారులో వెళ్లారు. కూతురుతో కలిసి కారులో స్వగ్రామానికి వస్తుండగా శనివారం తెల్లవారుజామున అడ్లూర్ ఎల్లారెడ్డి బ్రిడ్జి వద్దకు రాగానే ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. దీంతో కారు అదుపుతప్పి డివైడర్ ఎక్కి ముందున్న లారీని ఢీకొట్టడంతో గంగాధర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కూతురు గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

### చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



నారాయణ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న జాలర్లు

**బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి చేపలవేటకు వెళ్లిన ఓ జాలరి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానిక మత్స్యకారులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన బట్టుబుద్ధి నారాయణ(50) శనివారం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి చేపలవేటకు వెళ్లాడు. వల వేసుకుంటూ నీటిలోపలికి వెళ్లి, తిరిగి బయటకు రాలేదు. స్థానిక మత్స్యకారులు గమనించి అతడు నీటిలో మునిగిపోయాడని గుర్తించారు. వెంటనే గాలింపు చర్యలు చేపట్టగా నీటిలో మృతదేహం లభ్యమైందన్నారు. బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

**కరెంట్ షాక్‌తో ఒకరు..**



మల్లయ్య (ఫైల్)

**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి కరెంట్‌షాక్‌తో మృతిచెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చిందం మల్లయ్య(48), మరో వ్యక్తితో కలిసి ఈనెల 14న రాత్రి పెళ్లి పందిరికి కావాల్సిన అల్లనేరడు చెట్టకొమ్మలు తేవడానికి బ్రహ్మాజివాడి గ్రామశివారులోకి వెళ్లారు. ఈక్రమంలో ఓ చెట్టుపైకి ఎక్కి అతడు కొమ్మలు కొట్టివేస్తుండగా అక్కడే ఉన్న కరెంట్ తీగలపై పడ్డాయి. కొమ్మలు పచ్చిగా ఉండటంతో విద్యుత్ సరఫరా జరిగి మల్లయ్య కరెంట్‌షాక్‌తో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య కిష్టవ్వ, కుమారుడు మల్లేష్, ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### కుక్క దాడిలో పలువురికి గాయాలు


**పెర్కిట్(ఆర్మూర్):** ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శుక్రవారం ఒక పిచ్చి కుక్క వేర్వేరుగా దాడి చేసిన ఘటనలో వృద్ధురాలితోపాటు మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గ్రామంలో ఇంటి బయట పనుల్లో నిమగ్నమైన వారిపై కుక్క దాడి చేసి గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. కాగా క్షతగాత్రులను కుటుంబ సభ్యులు ఆర్మూర్ ప్రభు త్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు.

### వివాహిత అనుమానాస్పద మృతి

- భర్త చంపాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- న్యాయం చేయాలని ఆందోళన



ధర్పల్లిలో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు



అనూష (ఫైల్)

**ధర్పల్లి:** మండలకేంద్రంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ధర్పల్లికి చెందిన లోలం అనూష (26), వేల్పూర్ మండలం జాన్కంపేటకు చెందిన వినోద్ కొన్నేళ్ల క్రితం ప్రేమించుకుని, పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొద్దిరోజులుగా భార్యభర్తలు పిల్లలతో కలిసి ధర్పల్లిలోనే ఉంటున్నారు. ఈక్రమంలో శుక్రవారం దంపతుల మధ్య గొడవలు జరుగగా వినోద్ ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. అనంతరం అనూష మృతిచెంది ఉండగా, కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనూషను భర్తే చంపాడని, వెంటనే అతడిని పోలీసులు పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ, మృతురాలి బంధువులు శనివారం రాత్రి మండలకేంద్రంలో ఆందోళన చేపట్టారు. కాగా వినోద్ పరారీలో ఉన్నాడని, పోలీసులు అతని కోసం గాలిస్తున్నట్లు సమాచారం. తక్షణమే అనూష కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమం చేపడతామని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి సుజాత అన్నారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు




సీసీ ఫుటేజీలో దుండగుడి కదలికలు

**ఎడపల్లి(బోధన్):** మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న రెండంతస్తుల భవనంలో మొదటి అంతస్తులో కిరాణ దుకాణం ఉండగా, రెండవ అంతస్తులో నీలా భాస్కర్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. శుభకార్యం నిమిత్తం వారు శుక్రవారం ఇంటికి తాళం వేసి జిల్లాకేంద్రానికి వెళ్లారు. తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డిలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచిన సుమారు 13 తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులతోపాటు, రూ.3లక్షల నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. బాధితుడు నీలా భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### అప్పులు తీర్చలేక ఒకరి ఆత్మహత్య



నర్సింలు (ఫైల్)

**రామారెడ్డి:** ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేక తను నిర్మించిన ఇంట్లోనే ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇసన్నపల్లి గ్రామానికి చెందిన ధరణీ నర్సింలు(44) ఇంటికి 3రోజులుగా ఒక వైపు తాళం ఇంకో వైపు గడియా పెట్టి ఉండడంతో స్థానికులు శనివారం పోలీసులకు సమచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి చూడగా అతడు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. నర్సింలు మూడేళ్ల క్రితం కొత్త ఇల్లు నిర్మించుకున్నాడు. ఇల్లు నిర్మాణానికి చేసిన అప్పులు తీరకపోవడంతో అతడు బాధపడుతుండేవాడు. ఈక్రమంలో భార్య లక్ష్మి పుట్టింటికి వెళ్లగా, ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్‌రావు తెలిపారు.

**నిజాంసాగర్‌లో ఒకరు..**

**నిజాంసాగర్(జుక్కల్):** మండల కేంద్రంలో ఓ వ్యక్తి అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శివకుమార్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. బాన్సువాడ మండలం బుడ్మి గ్రామానికి చెందిన జీవన్(38), భార్య పిల్లలతో కలిసి నిజాంసాగర్ మండల కేంద్రానికి 8ఏళ్ల కిందట వలస వచ్చాడు. దంపతులు ఇద్దరు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. 2021లో అతడు పెద్ద కూతురు పెళ్లి కోసం రూ. 3లక్షలు అప్పు చేశారు. అప్పటి నుంచి అప్పులు పెరిగిపోవడంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో అతడి భార్య కొన్నిరోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి జీవన్ ఒక్కడే ఇంట్లో ఉంటుండగా, జీవితంపై విరక్తి చెంది ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### ఒకరి అదృశ్యం



శంకర్

**ఎల్లారెడ్డిరూరల్:** ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన నార్ల శంకర్ (40) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ శనివారం తెలిపారు. శంకర్ కొన్నిరోజుల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లగా, అతడి తల్లి మృతి చెందడంతో ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. హైదరాబాద్‌లో ఉన్న భార్యను ఈనెల 12న స్వగ్రామానికి రావాలని సూచించగా ఆమె రాలేదు. అప్పటినుంచి అతడు అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### కొబ్బరి బొండాల పేరిట బురిడీ

**ఖలీల్‌వాడి:** కొబ్బరి బొండాలు తక్కువ ధరకు పంపిస్తామంటూ ఆన్‌లైన్ మోసగాళ్లు బురిడీ కొట్టించారు. నగరానికి చెందిన ఓ వ్యక్తికి రూ.1.68లక్షలకు టోకరా వేశారు. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రూ.3లక్షల విలువచేసే కొబ్బరి బొండాలను రూ.1.68 లక్షలకు పంపిస్తామంటూ మొబైల్ ఫోన్‌లో ప్రకటన కనిపించడంతో కోజాకాలనీకి చెందిన షబానాజ్ ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాడు. కొబ్బరి బొండాలు రాకపోగా, ఆన్‌లైన్‌లో సంప్రదించినా సరైన స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గ్రహించాడు. టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.